# 4

# జీవిత దృశ్యాలు

శివరావు ముసలివాడైనాడు.

అని ఎవరు చెప్పారు?

గవర్నమెంటు చెప్పింది. మూడునెలలనుంచీ మంచం చెబుతున్నది. జబ్బు చెప్పింది.

శివరావుకి పెద్దతనం వచ్చేసింది. 'ఇక బ్రతకటం కూడ అనవసరమే—' అని ఇంట్లో వాళ్లు కొంతమంది అభిప్రాయపడుతున్నట్లుగా శివరావుకీ తెలిసింది. శివరావు యేమీ అనుకోలేదు. 'చూశావా' అనీ అనుకోలేదు. నిర్లిప్తుగా వుండిపోయినాడు.

ఒక ఉదయం.

శివరావుకి నీరసం మరీ యెక్కువయింది.

అమ్మ వొడిలోంచి తప్పించుకొని అందకుండా పరిగెత్తిన అల్లరిపిల్లవాడిలా తూర్పు దిక్కు వొడినుంచి సూర్యుడు చాలాపైకి వచ్చాడు. ఎనిమిది గంటలు కావచ్చును.

డాక్టరు వచ్చాడు.

శివరావుని చూశాడు.

డాక్టరు ముఖంలో శివరావు చూశాడు. తనకోసం కొత్త లోకపు తలుపు లెవరో తెరుస్తున్నారు. ఆ తలుపులు తెరిచే ద్వారపాలకులు మంచివాళ్ళకు మంచివాళ్లుగా చెడ్డవాళ్ళకు చెడ్డవాళ్లుగా కనిపిస్తారుట. శివరావు చూశాడు. శివరావుకి భయం వెయ్యలేదు.

డాక్టరు వెళ్ళిపొయ్యాడు. శివరావుకెందుకో దిగులైంది.

ఎందుకు? కొత్తలోకపు తలుపులెవరో తెరుస్తున్నారు.

డాక్టరు ఇంట్లోవాళ్ళకు యేం చెప్పాడో?

అంతా కళ్ళల్లో దయపెట్టుకుని చూసిపోతున్నారు.

ముసలాడికి దిగులైంది. నవ్వొచ్చింది.

కొడుకు వచ్చాడు. "నాన్నా, కాఫీ తాగుతావా?"

కొడుకు మూడేళ్ళపిల్లవాడిలా పిలిచాడు. ఈ మధ్య వాడెప్పుడూ అలా పిలవలేదు. శివరావుకి సంతోషమైంది.

కోడలు వచ్చింది."మామయ్యా,ఇంద, కాస్త పుచ్చుకోండి."

ఎన్నాళ్ళైంది, ఇంత ఆత్మీయత కనపరచి?

ఎందుకు వీళ్ళందరికీ ఇంత దయ?

తనకోసం కొత్త లోకపు తలుపు లెవరో తెరుస్తున్నారు.

అందుకే వీళ్ళ కళ్లు చెమరిస్తున్నాయి.

ఇది వీడ్కోలు కాబోలు.

అందుకా యింత ఆర్ద్రత! అవునుమరి. వీడ్కోలు దృశ్యంలో కపటాలూ కార్పణ్యాలూ, కోపాలూ తాపాలూ అన్నీ వదిలేసుకుంటారు. అందరు మనుష్యులూ అంతే.

ముసలాడికి నవ్వొచ్చింది.

కొడుకు ఆఫీసునుంచి ముందుగా వచ్చాడు.

కొడలు పదిసార్లు తొంగిచూసి పోయింది. మూడుసార్లు జ్వరం చూసింది. నాలుగుసార్లు దుప్పటి కప్పింది, రెండుసార్లు మందిచ్చింది. ఒకసారి పలకరించింది. కొడుకొచ్చి ప్రక్కనే కూచున్నాడు.

ముసలాడికి కళ్ళలో ప్రాణం వచ్చింది.

మూడురోజు లిలాగే జరిగింది.

ముసలాడు కోలుకున్నాడు. కొత్త లోకపు తలుపు లిప్పుడప్పుడే తెరవరట. బ్రతకాలనిపిస్తోంది.

నాలుగోరోజు డాక్టరు చెప్పాడు కొడుకుతో.

"తమాషాగా ఉందండీ. కోలుకుంటాడని అనుకోలేదు. ఇప్పుడప్పుడే యేం ఫరవాలేదు."

ముసలాడు విన్నాడు. నిర్లిప్తతతో వూరుకున్నాడు.

మర్రోజు నుంచీ మళ్ళీ మొదలు.

అతడు బ్రతకటం అనవసరం. పెద్దతనం వచ్చేసింది. పక్కలో ఎవరూ వచ్చి కూర్చోరు. దుప్పటి ఎవరూ కప్పరు.

శివరావుకి చిత్రమైంది.

శివరావు యెందుకు బ్రతికాడు?

వాళ్లు తన మీద అంత ప్రేమ చూపుతుంటే, డాక్టరు అలా చెప్పినప్పటి నుంచి కళ్ళనీళ్ళు పెట్టుకుంటుంటే, వీళ్ళకు తాను కావా అని, గుండెలకు హాయి కలిగి, బలంవచ్చి, బ్రతకాలని మనసుకు వాంఛ కలిగి బతికాడు.

కాని శివరావుకు మర్రోజే తెలిసింది తాను తప్పుగా అర్థం చేసుకున్నాడని. వీళ్ళకు తన మీద ప్రేమలేదు. పాపం చచ్చిపోతాడు కదా అని జాలిపడ్డారు. తాను తెలుసుకోలేదు.

మళ్ళీ డాక్టరు వచ్చాడు.

"మళ్ళీ దిగజారిపోయాడేమిటండీ'' అన్నాడు కొడుకుతో.

కొడుకు మాటాడలేదు.

కోడలు మాటాడలేదు.

ముసలాడు విస్తుపోలేదు.

'జాగ్రత్త' అన్నాడు డాక్టరు.

అని వెళ్ళిపొయ్యాడు.

శివరావు ఆలోచించాడు—

ఏమి టీ జీవితం? అని.

ఎందుకు బ్రతుకుతున్నాం, బ్రతికి ఏం సాధిస్తున్నాం అని.

చచ్చిపోతాం....చచ్చిపోయిన తర్వాత యేమిటని?

కథ మొదలు. అనగా అనగా వో ఊళ్ళో వో అయ్యా, అమ్మా ఉన్నారు. వాళ్ళ కో అబ్బాయి పుట్టాడు.

ఆ అబ్బాయి వాళ్ళమ్మ కాళ్ళమీద వేసుకుని నీళ్లు పోస్తుంటే యేడ్చాడు. సాంబ్రాణి ధూపం వేసుకున్నాడు. కళ్లకు కాటుక పెట్టు

కున్నాడు. నుదుట చాదు చుక్క పెట్టుకున్నాడు. ఉయ్యాల్లో నిద్ర పోయాడు. బోర్ల పడ్డాడు. బోసి నవ్వులు నవ్వాడు.అందరినీ నవ్వించాడు. ముద్దులు పెట్టించుకున్నాడు. గోరు ముద్దులు అన్నాడు. కూచున్నాడు. నిలుచున్నాడు. తప్పటడుగులు వేశాడు.

బడికి పోయినాడు. బలపాలు విరుచుకున్నాడు.పలకలు పగుల గొట్టుకున్నాడు. అ, ఆ లు దిద్దుకున్నాడు. గణితం నేర్చుకొన్నాడు. గోడకుర్చీలు వేశాడు. వాచకాలు చదివాడు. పద్యాలు కంఠస్థం చేశాడు. కూడికలూ, తీసివేతలూ. హెచ్చవేతలూ, భాగహారాలూ, ఇరవై యెక్కాలూ నేర్చుకున్నాడు. ఇంకా స్త పెద్దవాడైనాడు. గోలీకాయ లాడాడు. బిళ్ళాకోడూ ఆడాడు. ఇంకా స్త పెద్దవాడైనాడు. రహస్యంగా బీడీలు కాల్చాడు.

ఇంకా, ఇంకా........ఒక్కొక్క క్లాసే చదివి పెద్ద చదువు కొచ్చాడు.

నలగని మడతలు, చెరగని బట్టలు కట్టుకోవటం నేర్చుకొన్నాడు. జుట్టు చెదరకూడదు. రహస్యంగా అమ్మాయిలవేపు దొంగచూపులు చూడటం నేర్చుకొన్నాడు. వినపడీ వినపడకుండా కూనిరాగాలు తీసేవాడు.

ఇంకా, ఇంకా మంచి కథలు చదవటం నేర్చుకున్నాడు.
అందాన్ని ఆరాధించటం నేర్చుకొన్నాడు.
ఏమిటో అసంతృప్తి, ఏమిటో వెలితి, ఏమిటో అశాంతి!
కలలు కంటాడు. పువ్వులను ప్రేమిస్తాడు.
కలలు, కలలు, కలలు,
అందమైన అమ్మాయిలు, సినిమాలు, పార్కులు, పత్రికలు.

జీవితంపైన ఆదరం, భవిష్యత్తుపైన ఆశ, గతాన్ని తలచుకొని గర్వం, వర్తమానం అంటే భయంవేయకపోవటం - ఇదీ యౌవనం.

పెద్ద చదువులు చదివాడు. ఏదో ఉద్యోగమూ వచ్చింది.
జీవితంలో రెండో దశ.

పెండ్లి కూడా అయింది.

కలలో పండించుకున్న ఆశలను రాశిపోసుకున్నాడు.

చిటికెనవేలు యిచ్చి హోమగుండం చుట్టూ ప్రదక్షిణాలు చేయించాడు.

ఒకరు ఇద్దరయినారు. మధుపర్కాలు ముడివేసుకున్నారు.

తలంబ్రాలు పోసుకున్నారు. "మమ జీవన హేతునా...."

అన్నాడు. బొట్టుపెట్టాడు. గంధం పూశాడు. బొట్టు పెట్టించుకున్నాడు. గంధం పూయించుకున్నాడు.

కన్నుల్లో కన్నులుంచి బ్రతుకులోని తీయదనాన్ని అనుభవించాడు. ప్రియురాలి కన్నుల్లో జీవితానికి వ్యాఖ్యానం చదువుకున్నాడు. ఆమె చిరునవ్వును వెన్నెలనుకున్నాడు.

ఆమె కండ్లు మన్మథుని విండ్లు అనుకున్నాడు. ఆమె దేవత అనుకున్నాడు. తాను దేవుడైనాడు.

"అవిదిత గతయామా...."

ఇంకా ఇంకా....పిల్లల్ని కన్నాడు.

ఆమెనే అప్పుడప్పుడూ ఛీదరించుకోవటం నేర్చుకున్నాడు. కలలు కరగిపోయినవి. కళ్ళలో కాంతి తగ్గింది.

పిల్లలు పెద్దవాళ్ళవుతుంటే చూసి ఆనందించటం నేర్చుకున్నాడు. తన ప్రేమను పంచుకున్నాడు.

ఎన్నెన్నో ఊళ్లు చూశాడు.

ఎంతెంతమందినో మనుష్యులను చూశాడు.

బ్రతుకులో ఇదివరలో అనుభవించిన తీపిని నెమరువేసుకోవటం నేర్చుకున్నాడు. అప్పుడప్పుడు ఉస్సురని నిట్టూర్చేవాడు. బాధ్యతలూ, బరువులూ, బాధలూ, గడచిపోయిన గాథలూ....

ఎన్నెన్ని రకాల మనుష్యుల్ని చూశాడు.

ఎన్నిటికి బాధపడ్డాడు?

ఎన్నిటికి సంతోషించాడు?

ఎన్ని కష్టాలు వచ్చినై? ఎన్ని కన్నీళ్లు కారినై?

తన చుట్టూ ప్రపంచాన్ని చూసి అప్పుడప్పుడు దడుచుకున్నాడు. ఎందుకు? చిత్రమైన దీ ప్రపంచం.

దేవతార్చన చేస్తూనే గొడ్డు మాంసం అనే మనుష్యులున్నారిక్కడ. చిరునవ్వులు వెలారిస్తూనే చిచ్చుపెట్టగలవాళ్లున్నారిక్కడ. నోటితో మాటాడుతూ నొసలుతో వెక్కిరించగలరు మనుష్యులు. ఆత్మలు లేని శరీరాలు యెన్నో ఉన్నాయి. నీతిని గురించి ఉపన్యాసాలు చెపుతూ, అవినీతి పనులు ఎన్నైనా చేయగలరు. వంచన, దగా, మోసం జీవితానికి ముఖ్యమైనాయి.

అతనూ చేశాడు ఎన్నో పాడు పనులు.

అబద్ధాలు చెప్పాడు. నీచులను పొగిడాడు. పనులు చేయించుకున్నాడు.

కొడుకులకు చదువులు చెప్పించాడు.

కూతుళ్ళకు పెళ్లిళ్లు చేశాడు.

కొడుకులకు పెళ్లిళ్లు చేశాడు.

కూతుళ్ళను పురుళ్ళకు తెచ్చాడు.

కొడుకులకూ, కూతుళ్ళకూ కొడుకులూ, కూతుళ్ళూ పుడుతుంటే బారసాలలు చేయించాడు. వ్రతాలు చేయించాడు.

బారసాల పీటలమీద మంచి బట్టలు పెట్టలేదని అల్లుడలిగితే తాను అలిగినరోజులు గుర్తుతెచ్చుకున్నాడు.

వాన వస్తే యెన్నెన్నో అనుభూతులు త్రవ్వుకునేవాడు.

ఆమె యెక్కడుందో చూసేవాడు.

వానలో తడిస్తే ఇంటికి వచ్చినప్పుడు ఆమె కళ్ళలో ఎంత ఆత్రుత? నీళ్ళు వస్తాయేమోనని తలప్రక్కకి త్రిప్పుకోవటం గుర్తుకి తెచ్చుకునేవాడు. రహస్యంగా కాఫీలు అందించటాలూ, తాంబూల చర్వణాలు....జీవితం మారిపోతుంది సుమా అనుకునేవాడు.

ఎక్కడినుంచో భగవద్గీత కొనుక్కొచ్చుకున్నాడు.

ఈ మధ్యనే రామకోటి వ్రాయటం మొదలెట్టాడు.

పర్వదినాల్లో ఉపవాసా లుంటున్నాడు. అప్పుడప్పుడూ దేవాలయానికి పోతున్నాడు. "గోవిందం భజ మూఢమతే...." అంటున్నాడు అప్పుడప్పుడూ.

ఏమీ తోచనప్పుడు గజేంద్రమోక్షం చదువుకుంటాడు.

లేకపోతే పిల్లల్ని విసుక్కుంటాడు. కాకపోతే ఆమెను కసురుకుంటాడు.

ఏమిటో తెలుసుకోవాలన్న బలవత్తరమైన కోరిక.

ఏమిటీ తెలియటంలేదు.

ఇంత చంచలమైనదాన్ని చూసుకునేనా తాను ఇంత మోహాన్ని పెంచుకున్నాడు, ఇంతగా సంతోషించాడు!

ఏమున్నది ఇక్కడ?
సుఖాన్ని తూచేందుకు తక్కెడ!?
సుఖం లేదు, దుఃఖంలేదు. దేవుణ్ణి యేదీ అంటదు.
ఇది వేదాంతం.
మనుష్యుడికి అన్నీ తెలుసు.
మనుష్యుడికి ఏమీ తెలియదు.
మనుష్యుడి ఆంతర్యం మంచిదే.
కాని పాడు పనులు చేస్తాడు.
వద్దనుకుంటూనే పాడుపనులు చేస్తాడు.
కావాలని చేసేవాళ్ళుకూడ లేకపోలేదు.

ఏం చూసుకుని ఇంత గర్వం?
దేన్ని చూసుకుని యీ మోహం?
ఇది జీవితం.
లేనిది, ఏమీలేదు.
జీవితానికి సత్యమైనది మృత్యువొక్కటే.

"వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరో౽పరాణి
తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ."

అన్నాడు గీతాకారుడు.

Words move, music moves only in time; but that which is only living can only die...

అన్నాడు టి. ఎస్. ఇలియట్.
శివరావు ఇలా అనుకున్నాడు:
ఇవాళో రేపో, యెల్లుండో ఎప్పుడో నేనూ చచ్చిపోతాను.
తరువాత ఏమిటి?
దీనికి సమాధానం.
భగవద్గీత.
వేస్ట్ లాండ్.
చివరకు మిగిలేది....

———